క్లుప్తంగా

ఖాజాను పరామర్శించిన దద్దాల



ఖాజాను పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: ఇటీవల ప్రమాదవశాత్తు జారి పడి కాలు విరగడంతో ఆపరేషన్ చేయించుకున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాజామొహిద్దీన్ (ఖాజా)ను మంగళవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కోఆప్షన్ చింతం శ్రీనివాసుల యాదవ్, పులి శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ గొబ్బిళ్ల శ్రీను తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛతా హీ సేవలో చైర్మన్ గఫార్, కమిషనర్ జోసఫ్

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మండ్రు రమేష్‌బాబు, నవకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలు



కోలాట ప్రదర్శనల్లో విద్యార్థులు

కనిగిరి రూరల్: మండలంలోని లింగారెడ్డిపల్లి, కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.భ్రమరాంబ మాట్లాడుతూ విద్యార్థుల్లో సంస్కృతి సంప్రదాయాలు, ఆచారా వ్యవహారాలు, అలవాటు చేసుకుని ఆచరించడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పట్నం నరసింహాలు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్ కె.రంగారెడ్డి, పెద్దలు కె.వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ ఈఈగా వీరయ్య బాధ్యతల స్వీకరణ



వీరయ్య

కనిగిరి రూరల్: విద్యుత్ శాఖ కనిగిరి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఏ వీరయ్య మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కందుకూరు ఈఈగా పనిచేస్తూ కనిగిరికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా పనిచేసిన హరిబాబు ఒంగోలు ఈఈగా బదిలీపై వెళ్లారు. ఈమేరకు పలువురు ఉద్యోగులు, యూనియన్ నాయకులు ఈఈ ఏ వీరయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

టంగుటూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంజనేయులు మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలించినా, అక్రమంగా డంప్ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ

సింగరాయకొండ: పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారి సేవలు మరువలేనివని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా మూలగుంటపాడుకు చెందిన పారిశుధ్య కార్మికులను ఇద్దరిని శాలువాతో సత్కరించారు. ఈఓఆర్‌డీ సుధాకర్, స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ సీహెచ్ సుధాకర్, ఈఓ రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో సృజనాత్మకత వెలికితీత



చెకుముకి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు



కొండపిలో మాట్లాడుతున్న జేవీవీ నాయకుడు నాగేశ్వరరావు

పామూరు: విద్యార్థుల్లోని సృజనాత్మక పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్షలు నిర్వహించడం మంచి పరిణామమని ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. స్థానిక ఉన్నతపాఠశాలలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో 8,9,10 తరగతులు విద్యార్థులకు మండలస్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ మాట్లాడుతూ పోటీ పరీక్షలు చిన్నతనం నుంచే విద్యార్థులను పోటీతత్వాన్ని అలవర్చుతాయన్నారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉండి శాస్త్రీయ ఆలోచనలు, భావాలు పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం, కేజీబీవీ విద్యార్థులు ద్వితీయస్థానంలో నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో అల్ఫాహైస్కూల్ ప్రథమస్థానం, మదర్‌కేర్‌స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కాశె శంకర్, హెచ్‌ఎం రామస్వామి, సయ్యద్ ఇసాక్, జేవీవీ నాయకులు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): చెకుముకి ప్రతిభా పోటీలు విద్యార్థుల్లోని అంతర్గత విజ్ఞానాన్ని వెలికితీస్తాయని ఎంఈఓలు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి అన్నారు. సీఎస్‌పురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్‌టెస్ట్ పోటీలు నిర్వహించగా ప్రశ్నాపత్రాలను పాఠశాల హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అవిష్కరించారు. పోటీల్లో మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలకు చెందిన 24 మంది విద్యార్థులు పాల్గొనగా కదిరి వెంకట నరసయ్య లక్ష్మమ్మ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్లస్ విద్యార్థులు షేక్.హమీదా, గుర్రం సుప్రజా, మేకల మనోహర్‌ల టీం ప్రథమస్థానంలో నిలవగా ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్ అంబవరం, నల్లమడుగుల విద్యార్థులు నిలిచారు. విజేతలకు రాష్ట్ర మానవహక్కుల సంఘం చైర్మన్ షేక్.గౌస్ సమకూర్చిన బహుమతులను ఎంఈఓలు విజేతలకు అందజేశారు. జవంగుళ వెంకట్రావు, నాగినేని తిరుపతయ్య, డి.నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): జేవీవీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన 23 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకుడు జి.నాగేశ్వరరావు, విద్యార్థులు, ఉపాధ్యయులు, పాల్గొన్నారు.



పరీక్ష పత్రాలు విడుదల చేస్తున్న ఎంఈఓ, జేవీవీ నాయకులు

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. పోటీ పరీక్షలో పెద్దగొల్లపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులు కె.క్రిష్ణ, ఎస్.విష్ణు శరణ్య, ఎన్.లక్ష్మీ నేహలు ప్రథమస్థానంలో నిలిచారు. నందనవనం, విద్యార్థులు ద్వితీయ స్థానం, హనుమంతునిపాడు పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. దాతలు కేటీఆర్ స్టడీ సర్కిల్ అధినేత పాపారావు, విశ్రాంతి హెచ్‌ఎం జీవి.సురేష్‌బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ ఎస్ .రమణయ్య, హెచ్‌ఎం బొప్పరాజు సుబ్బారావు, షేక్ జిలానీ, బి.భాస్కర్ రెడ్డి, జేవీవీ మండల కార్యదర్శి ఎం బ్రహ్మయ్య, నాలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనతేళ్ల రిషిత ప్రియ

టంగుటూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేర్నమిట్ట హైస్కూల్‌లో నిర్వహించిన అండర్-14 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని తేళ్ళ రిషిత ప్రియ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరలో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రిషిత ప్రియ పాల్గొనునందని పీడీ అరుణ తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలుతులసి ప్రభ, ఉపాధ్యాయులు అభినందించారు.

అండర్-19 విభాగంలో

సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్ - 19 స్కూల్ గేమ్స్ పోటీల్లో మండలంలోని ఆలకూరపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తొమ్మిది మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. వాలీబాల్ పోటీలకు వి.హైమావతి, కె.శ్రీనిజ, టెన్నికాయిట్ పోటీలకు బాలుర విభాగంలో యు ఫణీంద్ర, కె.కార్తీకేయ, శివశంకర్, బాలికల విభాగంలో పి.జాహ్నవి, భవ్యశ్రీ, అలాగే అండర్- 14 బాలిక విభాగంలో వి.వందన, పి.సుచరిత ఎంపికయ్యారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ వెంకట్రావు పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు

కనిగిరి రూరల్: మోడల్ స్కూల్ విద్యార్థులు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీడీ జాన్ తెలిపారు. గత నెలలో దిరిశవంచలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు 29 మంది నియోజకరవ్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కంచర్లవారిపల్లిలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో వారిలో 14 మంది (అండర్ 14, 17 విభాగాలు) సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఒంగోలు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వారిలో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట స్థాయికి ఎంపికైన 10వ తరగతి విద్యార్థిని హరిణి(హాకీ విభాగం), 6వ తరగతి విద్యార్థి ప్రశాంత్ (అండర్ 14 వాలీబాల్ విభాగం) లను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ వీవీ రమణయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ పందిటి మోహన్, పీడీజాన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఎస్‌ఎంసీ చైర్మన్

గాంధీ జయంతి శుభాకాంక్షలు



డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: ప్రపంచానికి అహింస, సత్యాగ్రహం వంటి పదునైన ఆయుధాలను పరిచయం చేసిన గొప్ప వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని వైఎస్సార్ సీపీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రతి ఒక్కరు గాంధీ జయంతిని ఘనంగా జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం




అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాలల సంక్షేమ సంఘ నాయకులు

పామూరు: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలల సంక్షేమ సంఘం నాయకులు కోలనీడి బాబు, జొన్నలగడ్డ గోవిందయ్య అన్నారు. మండలంలోని ఇనిమెర్ల కాలనీలో మంగళవారం రాత్రి మాల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని 341 ఆర్టికల్‌ను పార్లమెంట్ ద్వారా సవరణచేసి శాశ్వతంగా ఇబ్బందులు లేకుండా చేయాలని, పాలకులు ఎస్సీలను విభజించి ఒక వర్గం వారిని ఓటుబ్యాంకుగా మార్చుకోవాలనే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. ఈ సందర్భంగా కొట్టే రవీంద్ర డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన పోరాటాలు, త్యాగం, ప్రస్తుతం మనం చేయాల్సిన బాధ్యతల గురించి, మాలల చరిత్రగురించి వివరించారు. వీరమాచనేని రాజశేఖర్, రాగి పోతురాజు, దమ్ము కార్తీక్, గాలంకి శ్రీనివాసులు, ఎద్దుల నమ్మయ్య, మాల్యాద్రి, సుబ్బారావు, యర్రగుంట్ల జయరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొణిజేడు చెరువుకి శాశ్వత సాగర్ నీరు కనెక్షన్ ఇవ్వాలి

టంగుటూరు: కొణిజేడు చెరువుకు శాశ్వత సాగర్ నీరు కనెక్షన్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. కొణిజేడు సీపీఎం శాఖ 5వ మహా సభలు ఎం. శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ కొణిజేడు చెరువుకి సాగర్ నీరు వచ్చే విధంగా శాశ్వత అనుమతులు ఇవ్వాలని ఎన్ఎస్‌పీ అధికారులను డిమాండ్ చేశారు. అరకొరగా నీళ్లు రావడంతో ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు దళిత పల్లెలకు స్మశాన స్థలం సమస్యను పరిష్కరించాలని, ఎస్టీ కాలనీలో ఎలిమెంటరీ స్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం కొణిజేడు గ్రామ శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా షేక్ మీరాస్‌ను ఎన్నుకున్నారు. టంగుటూరు మండల కన్వీనర్ మోజేసు, టి.రాము, ఎం. శ్రీనివాసు, కోటయ్య, మహేష్, దాసు, రామకోటయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

పామూరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ బీవీ రమణారావు, కనిగిరి ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశహాలులో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏఓ కంచం రాధ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్, ఏడీఏలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంకింద ప్రతి పౌరునికి ప్రభుత్వ కార్యాలయంలో అవసరమైన సమాచారం పొందే హక్కు ఉందన్నారు. కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందించాల్సి ఉంటుందని అలాచేయని పక్షంలో అప్పీలుకు వెళ్లేందుకు ప్రజలకు అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీఓ బి.సురేష్, ఎంఈఓ జి.కరుణకుమారి, డీటీ పృథ్వీ, ఏఓ కె.రాధ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



కొండారెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న పొలం బడి



కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలాకుమారి

హనుమంతునిపాడు: సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ అవుతుందని ఏఓ కె.రమణ అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, దాసరిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి, పండ్ల తోటల సాగు, నిమ్మ తోటలు పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై సలహాలు సూచలిచ్చారు. సాగు చేసిన ప్రతి పంటకు ఈ క్రాపు చేయించుకోవాలన్నారు. హెచ్ఓ ఎం.అంజలిబాయి, వీఏఏలు షేక్ ఖాధిర్, సాయి, రైతులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ నిర్మలకుమారి అన్నారు. మండలంలోని పెద్ద కండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారి డి.విజయ్కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తుందిలో ఆమె పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కంది పంట పొలాలను పరిశీలించారు. మైక్రో ఇరిగేషన్ ఎంఐఏఓ సుజాత, పెద్ద కండ్లగుంట వీఏఏ మహేష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు

జరుగుమల్లి(సింగరాయకొండ): మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని దర్శి ఉద్యానవన పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్టు డాక్టర్ డి.రవీంద్రబాబు రైతులకు సూచించారు. మండల ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణ నిర్వహించారు. జిల్లా ఉద్యానవన అధికారి గోపిచంద్ మాట్లాడుతూ అధికారుల సూచనలతో అవసరమైన మేరకే పురుగుమందులు, ఎరువులు వాడాలని అప్పుడే పంట దిగుబడి బాగా వస్తుందని వివరించారు. మండల ఉద్యానవన శాఖాధికారి డి.ప్రత్యూష, ఏఓ డి.యుగంధర్‌రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ, పశు వైద్యాధికారి డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిర్‌లో పింఛన్ల పంపిణీ



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సింగరాయకొండ: స్థానిక షిర్డీ సాయిమందిర్‌లో మంగళవారం దాతల సహకారంతో 50 మందికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకుడు కొల్లూరి సత్యన్నారాయణ తెలిపారు. ఈ సందర్భం ఆలయ కమిటీ సభ్యురాలు రాజమ్మ చేతుల మీదుగా వృద్ధులకు పింఛన్లు అందజేశారు. సత్యన్నారాయణ మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తామని, కొన్నేళ్లుగా దాతల సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు.

వృద్ధులను గౌరవించుకోవాలి

● జడ్జి భరత్‌చంద్ర



కార్డులను అందచేస్తున్న జడ్జి భరత్ చంద్ర

కనిగిరి రూరల్: వృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కనిగిరి కోర్టు జడ్జి కె.భరత్‌చంద్ర అన్నారు. స్థానిక వాసవీ వృద్ధుల ఆశ్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ, వాసవీ ఎడ్యుకేషనల్ సొసైటీ, గుడ్ హెల్ప్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జడ్జి కె.భరత్‌చంద్ర మాట్లాడుతూ వృద్ధులు గౌరవ ప్రదమైన జీవితాన్ని, గడిపే హక్కులు, చట్టాలపై అవగాహన కల్గించారు. తల్లిదండ్రులు, వృద్ధుల శ్రేయస్సు, సంరక్షణ చట్టం 2007 గురించి వివరించారు. తల్లిదండ్రులకు, వృద్ధులకు ఈ చట్ట ఆర్థిక భద్రత కల్పిస్తుందని తెలిపారు. వృద్ధులను సంరక్షణ సరిగ్గా చేయక పోయినా, తల్లి దండ్రులను, వృద్ధులను వదిలించుకోవాలని చూసినా.. సంతానం లేక బంధువులకు చట్ట ప్రకారం మూడు నెలలు జైలుశిక్ష, రూ.5వేల జరిమానా, లేదా రెండు విధించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను, పెన్షన్‌లను పంపిణీ చేశారు. న్యాయవాది, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్చాల నరసారెడ్డి, మాజీ అధ్యక్షుడు పాశం పిచ్చయ్య, న్యాయవాది సుమైర్, న్యాయవాది గుమస్తాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ యాసీన్, గంధ శ్యామ్యూల్, పారా లీగల్ వలంటీర్లు, వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మంచి భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ ఎస్‌కే ఖాజావలి



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థినులు

కనిగిరి రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యంతో ముందడగు వేసినప్పుడే మంచి భవిష్యత్ లభిస్తోందని సీఐ ఎస్‌కే ఖాజావలి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐ ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ ఏకాగ్రత, పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుదన్నారు. చెడు వ్యసనాలకు, చెడు అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. మీ మంచి భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో ఆశతో కళాశాల చదువులకు పంపిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. మంచి ప్రయోజకులుగా తయారై తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. ఇంటర్నెట్ వంటి సాంకేతికతను సత్ ప్రయోజనాలకు, విద్యా వ్యవస్థలోని నూతన పరిజ్ఞానానికి మాత్రమే సద్వినియోగం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఏసురత్నం, హెచ్‌ఎం మాధవ శర్మ, పీసీపల్లి కళాశాల ప్రిన్సిపాల్ విజయశంకర్, అధ్యాపకులు ఖాశింపీరా, సురేష్, వి. రామరాజు, కోటిసాహెబ్, చెన్నకేశవులు, బి.పద్మజ, డి.గురవమ్మ, నాగమణి, పీవీ రమణ, వెంకటరాజు, మునిస్వామి, మహమ్మద్ బాషా, సాయి, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

1031 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగవారం జరిగిన వేలంలో 1031 పొగాకు బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, జయవరం, పాలేటిపాడు గ్రామాలకు చెందిన రైతులు 1205 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1031 బేళ్లను కొనుగోలు చేసి 174 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.160, సరాసరి రూ.284.12 పలికింది. వేలంలో 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 486 బేళ్ల తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. చౌటపాలెం, పోలిరెడ్డిపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి, ఎస్ఎస్ కండ్రిక, పెట్లూరు వర్ధినేనివారి పాలెం, జగ్గారాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకండ్లగుంట గ్రామాలకు చెందిన రైతులు 1262 బేళ్ల వేలానికి తీసుకురాగా 776 బేళ్లను కొనుగోలు చేసి 486 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.140, సరారి రూ.192.99 పలికింది. వేలంలో 10 మంది వ్యాపారులు పాల్గొన్నారు.